క్లుప్తంగా

ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడికి సన్మానం



చిన్నారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: రాష్ట్ర ప్రణాళిక సంఘం బోర్డు ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన చిన్నారెడ్డిని శుక్రవారం షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సయ్యద్ సాధిక్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయానికి వెళ్లిన నేతలు చిన్నారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. చిన్నారెడ్డికి ఎంతో రాజకీయ అనుభవం ఉందన్నారు. కేబినెట్ మంత్రి హోదాలో చిన్నారెడ్డిని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా నియమించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో నవాజ్‌గోరి, ఖాదర్‌గోరి, తదితరులు పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయంతో మంచి లాభాలు

కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సుధీర్‌కుమార్



రైతులకు అవగాహన కల్పిస్తున్న సుధీర్‌కుమార్

షాబాద్: సమీకృత వ్యవసాయంతో రైతులకు మంచి లాభాలు వస్తాయని కృషి విజ్ఞాన కేంద్రం పశుసంవర్థక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ సుధీర్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రేగడిదోస్వాడ గ్రామంలో క్రిడా కృషి విజ్ఞాన కేంద్రం, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమీకృత వ్యవసాయంపై సుగుణమాల రైతు ఉత్పత్తి దారుల సంఘం రైతులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమీకృత వ్యవసాయంతో రైతులకు మంచి లాభాలు వస్తాయన్నారు. పాడి పరిశ్రమ, కోళ్ల, గొర్రెలు, మేకల పెంపకం లాభసాటిగా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ.. పంటలలో మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు, పాటించాల్సిన మెలకువలు, ఆధునిక వ్యవసాయ పరికరాల గురించి వివరించారు. కార్యక్రమంలో రైతులు మాధవరెడ్డి, నర్సింహారెడ్డి, పోచయ్య, ఆనంద్, రవీందర్‌రెడ్డి, మల్లారెడ్డి, హనుమంతు, మాణెయ్య, రాంచంద్రయ్య తదితరులున్నారు.

విజ్ఞానాన్ని పెంపొందించేవే సైన్స్‌ఫెయిర్స్

జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక

మొయినాబాద్ రూరల్: విజ్ఞానాన్ని పెంపొందించేవి సైన్స్‌ఫెయిర్ అని అమ్డాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అమ్డాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన నమూనాలను ప్రదర్శనలో ఉంచారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు రేణుక మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను బయటకు తీయడానికి ఇలాంటి వేదికలు తోడ్పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నాగేష్‌బాబు, సత్యనారాయణరెడ్డి, స్వరూప, మంజుల, సంజీవన్‌కుమార్, సంగీత, అరుణ, పీఈటీ సత్యనారాయణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రం ప్రారంభిస్తున్న మురళియాదవ్

కొందుర్గు: చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయమని బీఆర్‌ఎస్ నాయకుడు మురళియాదవ్ పేర్కొన్నారు. మండలంలోని రామచంద్రాపూర్ గ్రామ ముఖ్య కూడలిలో శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకుడు మధుసూదన్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుమారుడు రవీందర్ రెడ్డి రామచంద్రాపూర్‌లో ఐదేళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారన్నారు. వేసవిలో దాహార్తి తీర్చడానికి ఇవి ఉపయోగపడుతాయని రవీందర్ రెడ్డి అన్నారు. వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, బీఆర్‌ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాసు రెడ్డి, నటరాజ్, గోపాల్, మన్న నారాయణ, రవీయాదవ్, రఘు గౌడ్, దర్గ రామచంద్రయ్య, రామచంద్రయ్య, శేఖర్, ఖలామ్, గణేష్ పాల్గొన్నారు.

బడులకూ ‘వెలుగు’లివ్వండి

- ప్రభుత్వ పాఠశాలలకు గృహజ్యోతి పథకాన్ని అమలు చేయండి
- ఉపాధ్యాయుల వినతి
- 200 యూనిట్ల వరకు ఉచితం చేయాలని వేడుకోలు
- స్కూల్ గ్రాంట్స్.. కరెంట్ బిల్లులకే సరిపోతున్నాయని ఆవేదన



ఉచిత కరెంట్ కోసం వివరాలు సేకరిస్తున్న విద్యుత్ సిబ్బంది

కేశంపేట: కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా కరెంట్ ఇస్తామని హామీ ఇచ్చింది. ఎన్నికలు ముగిశాయి. కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వచ్చింది. ఎన్నికల హామీలో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్‌ను అందించేందుకు ఏర్పాట్లు కూడా చేస్తుంది. దీంతో గ్రామాల్లో విద్యుత్ అధికారులు మీటర్ రీడింగ్ నమోదు సమయంలో కుటుంబ యజమాని వివరాలను సేకరించారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడులకు కూడా ఉచితంగా విద్యుత్‌ను అందించాలని ఉపాధ్యాయులతో పాటు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రభుత్వం పాఠశాలల నిర్వహణ ఖర్చులు, మౌలిక వసతులతో పాటు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు గ్రాంటులను విడుదల చేస్తుంది. ఈ గ్రాంట్ల నుంచి కరెంట్ బిల్లులు, జాతీయ జెండా పండుగలు, ఎస్‌ఏ1, ఎస్‌ఏ2 పరీక్షలు, చాక్‌పీసులు, డస్టర్లు వంటి వాటిని ఉపాధ్యాయులు కొనుగోలు చేస్తారు. ‘మన ఊరు మన బడి’లో భాగంగా పాఠశాలలకు ఉచితంగా డిజిటల్ బోర్డులను ప్రభుత్వం అందించింది. వాటి వినియోగానికి కూడా విద్యుత్ అవసరం ఉంటుంది. వచ్చిన గ్రాంట్లు పాఠశాల అవసరాలకే సరిపోవడం లేదని, కరెంట్ బిల్లుల చెల్లింపునకు కష్టంగా ఉందని, నిర్వహణ ఖర్చులు పెరుగుతున్నాయని ఉపాధ్యాయులు తెలిపారు. ప్రజలకు ఇచ్చినట్టుగానే ప్రభుత్వ బడులకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం 200 యూనిట్ల వరకైనా ఉచితంగా కరెంట్ ఇవ్వాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

గ్రాంట్లు ఇలా..

ప్రభుత్వ పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం 30 మంది లోపు విద్యార్థులు ఉంటే రూ.10వేలు, 100లోపు ఉంటే రూ. 25వేలు, 250 లోపు ఉంటే రూ. 50వేలు, 1000లోపు ఉంటే రూ.75వేలు, 1000 పైన ఉంటే రూ.75వేల పై చిలుకు వస్తుంది. ఈ గ్రాంటు సంవత్సరానికి రెండు సార్లు విడుదల చేస్తారు. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు సగం గ్రాంట్లను మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది.

ఉచిత కరెంట్ సరఫరా చేయాలి



ప్రభుత్వ బడుల్లో డిజిటల్ బోర్డులను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. వీటి నిర్వహణకు విద్యుత్ అవసరం ఉంటుంది. వచ్చిన గ్రాంట్లు పాఠశాలలో మౌలిక అవసరాలకే సరిపోవడం లేదు. చాక్‌పీసు, డస్టర్లు వంటి వాటికి కూడా ఎక్కువగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. కాబట్టి పాఠశాలలకు కూడా ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలి.

– శ్రీనివాససాగర్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు, కేశంపేట

విద్యాభివృద్ధికి కృషి



పాఠశాలలను క్యాటగిరి 2లో పెట్టడం వల్ల విద్యుత్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయి. విద్యార్థుల సంఖ్యను బట్టి కాకుండా ఫిక్స్‌డ్ గ్రాంట్లను మంజూరు చేయాలి. కొన్ని పాఠశాలల్లో సంఖ్యా తక్కువగా ఉన్నా విద్యుత్ వాడకం తక్కువగా ఉండదు. ప్రభుత్వం ఆలోచించి ప్రభుత్వ బడులకు కూడా ఉచిత కరెంట్‌ను అందించి విద్యాభివృద్ధికి కృషి చేయాలి.

– అంజన్‌రెడ్డి, టీపీయూఎస్ మండల అధ్యక్షుడు, కేశంపేట

అవినీతి రహిత సమాజమే లక్ష్యం



షాద్‌నగర్ రూరల్: ఓటు వేసేందుకు క్యూలో నిలబడిన విద్యార్థులు

షాద్‌నగర్ రూరల్: అవినీతి రహిత సమాజ నిర్మాణమే లక్ష్యమని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మశ్రీశైలజ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఆధ్వర్యంలో నమూనా ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఆరోతరగతి నుంచి పదోతరగతి విద్యార్థులకు ఓటు ప్రాధాన్యత, ఎన్నికల నిర్వహణ, ఎన్నికల ప్రచారం, నాయకులను ఎన్నుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఈ నమూనా ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా విద్యార్థులు పోటీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. భోజన విరామం తరువాత ఎన్నికల అధికారులు ఓట్లు లెక్కించారు. ఈ ఎన్నికల్లో శశికుమార్ 172 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించినట్లు ఫలితాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లీడర్ షిప్ అలవాటు చేయాలి

మొయినాబాద్ రూరల్: విద్యార్థి దశ నుంచే లీడర్ షిప్ అలవాటు చేయాలని అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయురాలు రజియా సుల్తానా అన్నారు. శుక్రవారం అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాక్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఆరుగురు విద్యార్థులు పోటీ చేశారు. అందులో ప్రోసిడింగ్ అధికారులుగా మాధురి, వేణు వ్యవహరించారు. పోలింగ్ అధికారులుగా విశ్వంత్, తులసీ, రాంచరణ్, దీపక్, శ్రీలక్ష్మి, రాణి, రిటర్నింగ్ అధికారిగా సనాబేగం బాధ్యతలు తీసుకున్నారు. ఈ పోటీల్లో శివర్ధన్ విజేతగా నిలిచినట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించి ధ్రువపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సక్కుబాయి, శేఖర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



మొయినాబాద్ రూరల్: విజేతకు ధ్రువపత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి, ఉపాధ్యాయులు

గ్రామాల అభివృద్ధికి కృషి



పనులు ప్రారంభిస్తున్న భార్గవరామ్, పెంటారెడ్డి

షాబాద్: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి పామెన భార్గవరామ్, చేవెళ్ల నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు పెంటారెడ్డి పేర్కొన్నారు. బోడంపహాడ్‌లో ఎన్‌ఆర్‌ఈ జీఎస్ కింద రూ.10 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని అభివృద్ధి, సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలు చేయనున్నట్లు చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు నర్సింహులు, చిన్నయ్య, చెన్నయ్య, ఆనంద్, రఫీక్, నవీన్, చెన్నయ్య, రఘపతిరెడ్డి, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులను ఆదుకోవాలి

పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఏఎంఆర్ ట్రస్టు చైర్మన్ ఎలుగంటి అభిరామ్‌రెడ్డి



జామెట్రీబాక్స్, పెన్నులు, పెన్సిళ్లు, ప్యాడ్స్‌లు అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

షాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను ఆదుకోవాలని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఏఎంఆర్ ట్రస్టు చైర్మన్ ఎలుగంటి అభిరామ్‌రెడ్డి, తల్లి కవితతో కలిసి శుక్రవారం షాబాద్ మండల పరిధిలో పదోతరగతి చదువుతున్న 567మంది పేద విద్యార్థులకు జామెట్రీబాక్స్, పెన్నులు, పెన్సిళ్లు, ఎగ్జామ్ ప్యాడ్స్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలకు అవసరమైన వసతులు, విద్యార్థులకు కావలసిన సామగ్రి అందజేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని చెప్పారు. గురువులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని తల్లిదండ్రులు కన్న కలలను నిజం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, రవీందర్‌నాయక్, జనార్దన్‌రెడ్డి, రాహుల్‌గుప్తా, సుభాష్‌రెడ్డి, గౌరీశ్వర్, శేఖర్, తౌసిఫ్, హరికృష్ణరెడ్డి, తదితులు పాల్గొన్నారు.

వ్యాధి నివారణకు టీకా తప్పనిసరి

పశువైద్య అధికారి శ్రీలతరెడ్డి

మొయినాబాద్ రూరల్: వ్యాధి నివారణకు పశువులకు టీకాలు వేయించాలని, వేసవిలో జాగ్రత్తగా కాపాడుకోవాలని కనకమామిడి పశువైద్య అధికారి శ్రీలతరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కనకమామిడిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు గాలికుంటు సోకకుండా ముందస్తుగా టీకాలు వేయించుకోవాలన్నారు. ఈ వ్యాధి సోకితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. పశువులను ఉదయం, సాయంత్రం మేతకు తీసుకువెళ్లాలని సూచించారు. ఎండలో పశువులను తిప్పొదన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

‘పాలమూరు’ పూర్తి చేయడంలో విఫలం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రాజెక్టు సందర్శనకు వెళ్లిన ఎమ్మెల్యే, నాయకులు

షాద్‌నగర్: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తి చేయడంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించేందుకు కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడు భూములకు సాగునీరు, తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని చేపట్టిందన్నారు. పదేళ్ల కాలంలో ఈ ప్రాజెక్టును నిర్మించడంలో బీఆర్‌ఎస్ పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. చుక్క నీటిని కూడా పంట పొలాలకు అందించ లేదన్నారు. 80శాతం పనులు పూర్తి చేశామని చెబుతున్న బీఆర్‌ఎస్ నేతలు పనులు ఎక్కడ పూర్తి చేశారో ప్రజలకు చూపించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా షాద్‌నగర్ పరిధిలోని లక్ష్మీదేవునిపల్లి రిజర్వాయర్‌ను కుర్చీ వేసుకొని నిర్మిస్తామని చెప్పిన కేసీఆర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. కనీసం సర్వే పనులు చేపట్టి తట్టెడు మట్టిని కూడా తీయించలేదన్నారు. గత పాలకులు రిజర్వాయర్ నిర్మాణానికి ఎలాంటి కృషి చేయలేదని, కనీసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నం చేయలేదని ఆరోపించారు. ప్రాజెక్టు పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని పూర్తిగా దోచుకుందని విమర్శించారు. బీఆర్‌ఎస్ పాలనలో అంతా కుటుంబ పాలన కొనసాగిందని, ఆ పార్టీ నాయకులు అంతా రాష్ట్రాన్ని దోచుకొని, సొమ్మంతా దాచుకున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులు, అవినీతి ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయన్నారు. తప్పులను కప్పిపుచ్చుకునేందుకు బీఆర్‌ఎస్ నేతలు మళ్లీ మాయమాటలు చెబుతున్నారన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచిన బీఆర్‌ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ప్రాజెక్టు సందర్శనకు వెళ్లిన వారిలో మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, అందెమోహన్, రాజేందర్‌రెడ్డి, ముబారక్, మంగ మధు, ప్రవీణ్, కిషోర్, సుదర్శన్, అనంతం, శ్రీహరిగౌడ్, సీతారాం, అశోక్, ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫస్టియర్‌లో 151మంది గైర్హాజరు

షాద్‌నగర్: ఇంటర్ ఫస్టియర్‌లో శుక్రవారం 151మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు కస్టోడియన్ అధికారి శ్రీకాంత్ తెలిపారు. షాద్‌నగర్‌లోని ఆరు పరీక్షా కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 412 మందికి గాను 388, మొగిలిగిద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 332గాను 318, ప్రతిభ బాలికల కళాశాలలో 376గాను 350, విశ్వభారతి కళాశాలలో 478గాను 464, విజ్ఞాన్ కళాశాలలో 502గాను 460, విజేత కళాశాలలో 352గాను 321 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అన్నీ పరీక్షా కేంద్రాల్లో 2452గాను 2301మంది పరీక్షలు రాసినట్లు, 151 మంది గైర్హాజరు అయినట్లు పరీక్షల కస్టోడియన్ అధికారి శ్రీకాంత్ తెలిపారు.

అర్హులకు గృహజ్యోతి పథకం వర్తింపు

విద్యుత్ ఏడీ స్వామి, ఏఈ జానీమొహినుద్దీన్



మాట్లాడుతున్న ఏడీ స్వామి, ఏఈ జానీమొహినుద్దీన్

చేవెళ్ల: కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న గృహజ్యోతి పథకం కింద అర్హులైన ప్రతి ఒక్కరికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వనున్నట్లు ఏడీ స్వామి, ఏఈ జానీమొహినుద్దీన్‌లు అన్నారు. శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మార్చి నెల కరెంట్ బిల్లులు ఈ పథకానికి వర్తింపజేస్తున్నారన్నారు. ఇప్పటికే గ్రామాల్లో లబ్ధిదారులు ప్రజాపాలన దరఖాస్తుల సమయంలో గృహజ్యోతి పథకానికి సంబంధించిన అంశంలో వారి వివరాలను నమోదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యుత్ సర్వీస్ నెంబర్, ఆధార్‌కార్డు, ఫోన్‌నెంబర్‌లు సక్రమంగా నింపిన లబ్ధిదారుల వివరాలను అప్‌డేట్ చేశారన్నారు. ఎవరైనా దరఖాస్తు చేయని వారు ఉంటే ఆధార్, ఫోన్ నెంబర్‌లను విద్యుత్ శాఖ అధికారులకు అందిస్తే అప్‌డేట్ చేస్తారన్నారు. చేవెళ్ల మండలంలో మొత్తం 17,928 ఇళ్ల సర్వీస్ మీటర్లు ఉన్నాయని ఇందులో 9,229 మంది 200యూనిట్ల ఉచిత విద్యుత్‌కు అర్హత పొందినట్లు తెలిపారు. షాబాద్ మండలంలో మొత్తం 12,180 ఇళ్లకు సంబంధించిన సర్వీస్ మీటర్లు ఉన్నాయని ఇందులో 6,607 మంది లబ్ధిదారులకు 200యూనిట్ల ఉచిత విద్యుత్‌కు అర్హత పొందినట్లు చెప్పారు. వారికి ఈ నెల జీరో బిల్లు వస్తుందని వారు బిల్లు కట్టాల్సిన పని లేదని అధికారులు వివరించారు.

‘రాజేందర్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి’



షాబాద్: మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

చేవెళ్ల: మండలకేంద్రంలో శుక్రవారం దివంగత పట్నం రాజేందర్‌రెడ్డి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చేవెళ్లలో ఆయన విగ్రహానికి ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పట్నం అవినాస్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని నాయకులకు మార్గదర్శకుడని, ఆయన ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాలకు చెందిన నాయకులు డి. వెంకట్‌రెడ్డి, డీపీఆర్, ఆగిరెడ్డి, రమేశ్‌రెడ్డి, యాదగిరి, ఎం. బాల్‌రాజ్, మహేందర్‌రెడ్డి, ప్రభాకర్, రఘువీర్‌రెడ్డి, టేకుపల్లి శ్రీనివాస్, నరేందర్, నర్సింలు, రవీందర్, వెంకటేశ్, ప్రసాద్, ఎల్లయ్య, చందు, రాజు ఉన్నారు.

షాబాద్‌లో..

షాబాద్: షాబాద్ పీఆర్‌ఆర్ మీని స్టేడియంలో రాష్ట్ర, జాతీయస్థాయిలో క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించేందుకు కృషి చేస్తామని జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాజేందర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని పీఆర్‌ఆర్ మీని స్టేడియంలో వారం రోజులుగా ఆయన స్మారకార్థం నిర్వహించిన జిల్లా స్థాయి, క్రికెట్, వాలీబాల్, క్యారం పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డితో కలిసి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గెలుపొందిన క్రీడాకారులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. కాబట్టి ప్రతిఒక్కరూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. త్వరలో షాబాద్ మండల కేంద్రంలోని మీని స్టేడియంలో జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు నిర్వహించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు.

రాజేందర్‌రెడ్డి సేవలు మరువ లేనివి

రాజేందర్‌రెడ్డి ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని జడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గూడూరు నరింగ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు వెంకటయ్య, నక్క శ్రీనివాస్‌గౌడ్, నర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు రాజీలేని పోరాటం

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ్మా

షాద్‌నగర్: ఎస్సీ వర్గీకరణకు రాజీలేని పోరాటం చేస్తున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ్మా అన్నారు. మాదిగ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని షాద్‌నగర్ ఇన్‌చార్జి పెంటనోళ్ల రవికుమార్ ఆధ్వర్యంలో పట్టణ చౌరస్తాలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సింహ్మా హాజరై అమర వీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతి అస్తిత్వం కోసం, ఆత్మగౌరవం కోసం, హక్కుల కోసం తమ ప్రాణాలు అర్పించిన వీరులు ఎల్లప్పుడు మాదిగ ప్రజల గుండెల్లో ఉంటారన్నారు. వీరులకు ఏనాడు మరణ ఉండదని, వారు చిరకాలం కీర్తించబడతారన్నారు. వర్గీకరణతోనే సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, బుర్ర రాంచంద్రయ్య, కొంగర లక్ష్మయ్య, శ్రావణ్‌కుమార్, రామకృష్ణ, శ్రీనివాస్, బంటి, నవీన్, ఆకాశ్, అజార్, వినయ్‌కుమార్, ప్రవీణ్, ప్రశాంత్, భూషణ్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు